క్లుప్తంగా

ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల అందజేత



ఖానాపురం : మండలంలోని రాగంపేట శివారులో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు ఆశ కార్యకర్త తడుగుల సంధ్య ఆధ్వర్యంలో సర్పంచ్ బాషబోయిన ఐలయ్య మంగళవారం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కూలీలకు ఉపాధిహామీ పనులు అధికంగా కల్పించాలన్నారు. పనులు చేసే ప్రాంతంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. వడదెబ్బ తగలకుండా సూచనలు పాటించాలన్నారు. వార్డు సభ్యులు లలిత, రాధమ్మ, కొమురమ్మ, ఉపాధి కూలీలు ఉన్నారు.

ఆర్థికసాయం



రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కోరెం సోమిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన మృతుడు సోమిరెడ్డికి ఇద్దరు కూతుళ్లు, భార్య ఉండడంతో స్థానికులు చలించారు. గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి రూ.50వేలు, పదోతరగతి మిత్రులు రూ.22వేలు, బంధువులు రూ.13వేలు, గ్రామస్తులు రూ.1,15,000ల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లేతాకుల సుమతియాదవరెడ్డి, కోరెం సాయిరెడ్డి, కె.పరమాత్మరెడ్డి, ఈదులకంటి మహిపాల్‌రెడ్డి, కె.మహిపాల్‌రెడ్డి, ఎస్.మహేందర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, గుంటి మహేందర్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

ఎస్సైలకు సన్మానం



వర్ధన్నపేట : బదిలీపై వెళ్తున్న ఎస్సై రామారావును, బాధ్యతలు స్వీకరించిన ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను మంగళవారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వారిని పూల బొకేలను అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు చీటూరి రాజు, నాయకులు కొండేటి సత్యం, పెద్దూరి రాజు, పిట్టల రాజు, బోంపెల్లి దేవేందర్‌రావు, ఎలమకంటి గిరిప్రసాద్, బాల్య విక్రమ్, మల్లెపాక అనిల్, కొండేటి బాబు, అంగోత్ దేవేందర్, తేజనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

కాజీపేట: స్థానిక స్వయంభూ శ్రీశ్వేతార్క మూలగణపతి దివ్య క్షేత్రంలో మంగళవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వేసవి ఎండలు మండిపోతున్న నేపథ్యంలో వాతావరణం చల్లబడాలని ఆకాంక్షిస్తూ బ్రహ్మశ్రీ త్రిగుళ్ల శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు 108 లీటర్ల బెల్లం పానకంతో 108 సార్లు మన్యుసూక్త విధానంతో అభిషేకం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, మణిదీప్, రవి, సుధీర్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

కాశిబుగ్గ : నగరంలోని కాశిబుగ్గలో లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో వరుసగా 50వ రోజు చల్లని మంచినీటితో పాటు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. మంగళవారం ముఖ్య అతిథిగా వరంగల్ ట్రాఫిక్ సీఐ బాబులాల్ హాజరై చలివేంద్రాన్ని సందర్శించి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తి తీరుస్తున్న లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం సేవలను కొనియాడారు. వేముల నాగరాజు, రాంప్రసాద్, చందు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలి

న్యూశాయంపేట : మధ్యాహ్న భోజనం కార్మికులకు బిల్లులు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలో అనుబంధ తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ సమావేశం జిల్లా అధ్యక్షుడు డి.రామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు నెలల తరబడి వంట వండి పెడుతున్న కార్మికులకు విద్యాశాఖ బిల్లులు చెల్లించకుండా తాత్సారం చేస్తుందని ఆరోపించారు.

కులవృత్తులకు చేయూత

కాజీపేట అర్బన్ : వెనుకబడిన కులవృత్తులు, చేతివృత్తిదారులకు చేయూతనిచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందజేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏండ్ల నుండి 55 ఏండ్లలోపు గల వెనుకబడిన తరగతుల వారు ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

అమ్ముకునేందుకు అరిగోస

- వేధిస్తున్న లారీల కొరత
- ధాన్యం రాశుల వద్దే రైతుల పడిగాపులు
- అన్నదాతలకు తప్పని ఇబ్బందులు



కాంటా వేసి కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలు

నల్లబెల్లి : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. యాసంగి సీజన్ ధాన్యం కోతలు కోసి, దిగుబడి వచ్చి నెలరోజులు గడుస్తోంది. అయినా కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం రాశుల కుప్పలు ఎక్కడికక్కడే నిల్వ ఉన్నాయి. రైతులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని సహకార సంఘాలతో పాటు, ఐకేపీ ద్వారా రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కానీ సకాలంలో కాంటాలు పెట్టి మిల్లులకు తరలించడంలో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. ఫలితంగా రైతులకు రోజుల తరబడి పడిగాపులు తప్పడం లేదు.

ఎక్కడికక్కడే ధాన్యం రాశులు

కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం రాశులు ఎక్కడికక్కడే పేరుకుపోయాయి. నల్లబెల్లి మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు కేవలం 48వేల క్వింటాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 10వేల క్వింటాలు మాత్రమే కొనుగోలు చేశారు.

లారీలు రాక రైతుల అరిగోస

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలను లారీలలో సంబంధిత రైస్ మిల్లులకు తరలించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. కాగా లారీలు సకాలంలో రావడంలేదు. దీంతో బస్తాలు తరలించే వరకు వాటి వద్దే కాపలా ఉండే దుస్థితి నెలకొంది. ధాన్యం అమ్మడానికి సుమారు 20 రోజులు పడుతుందని రైతులు వాపోతున్నారు.



టార్పాలిన్ కప్పిన బస్తాల వద్ద రైతులు

ఇబ్బంది పడుతున్నాం..



నల్లబెల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి 20 రోజుల క్రితం 80బస్తాల ధాన్యం తీసుకవచ్చా. ఇప్పటికే రెండు సార్లు వర్షం వస్తే ధాన్యం తడిసింది. మళ్లీ మబ్బుఅయితాంది. వర్షం వస్తే ధాన్యం తడిసే అవకాశం ఉంది. రాత్రి పగలు తేడా లేకుండా 20 రోజులుగా కుప్పల వద్దే ఉంటున్నా. వేరే వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్నా. అధికారులు ఇప్పటికైనా ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లుకు తరలించాలి.

- నానబోయిన మల్లయ్య, రైతు, నల్లబెల్లి

చర్యలు తీసుకుంటున్నాం..



ధాన్యం కొనుగోలుకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. సమస్యలను అధిగమించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేశాం. లారీలు సకాలంలో రాకపోవడం, మిల్లుల వద్ద అన్‌లోడ్ చేయకపోవడంతో రైతులు కొంతమేర ఇబ్బంది పడుతున్నారు. సమస్యను అధిగమించేందుకు కృషి చేస్తాం.

- చెట్టుపల్లి మురళీధర్, పీఏసీఎస్ చైర్మన్

ఆగిన రోడ్డు విస్తరణ పనులు!

ఇబ్బందుల్లో ప్రయాణికులు, స్థానికులు

చెన్నారావుపేట : మండల కేంద్రంలో ప్రారంభించిన రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ఎందుకు ఆగాయో ఎవరికి అంతుపట్టడం లేదు.. గ్రామపంచాయతీ పాలకులు నోటీసులు ఇచ్చి రోడ్డుకు అడ్డుగా ఉన్న ఇళ్లను తొలగిస్తున్నారు. జోరుగా సాగుతున్న పనులు ఒక్కసారిగా నిలిచిపోవడంతో ఏమి జరిగిందో ఎవరికి అర్థం కావడం లేదు.. వాహనాలు వెళ్తున్న సమయంలో దుమ్ము లేచి ప్రయాణికులు, బాటసారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు..

ఆర్టీసీ బస్టాండ్ కూల్చడమే కారణమా?

మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను రోడ్డుకు అడ్డుగా ఉందని కాంట్రాక్టర్ సంబంధిత వర్కర్లు తొలగించారు. దీంతో గ్రామపంచాయతీ పాలకులు, ఆర్టీసీ అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎలా కూల్చుతారని ప్రశ్నించడమే కాకుండా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



వాహనాలు వెళ్తున్నప్పుడు లేస్తున్న దుమ్ము

అప్పటి నుంచి రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగడంలేదు. దీంతో అభివృద్ధి పనులకు ఎవరూ సహకరించకపోవడంతో కాంట్రాక్టర్ వెళ్లిపోయాడని చర్చించుకోవడం విశేషం.. ఈ విషయంపై సదరు కాంట్రాక్టర్ వివరణ కోరగా కంకర కోసం పనులు ఆపాము.. కోనాపురం రోడ్డు పనులు జరుగుతున్నాయి.. అక్కడి నుంచి కంకర తేవాల్సి ఉంది రోడ్డు పనులు పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఏది ఏమైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు తొందరగా అయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం, శివాలయాల నిర్మాణాలకు దాతలు విరాళాలు అందజేశారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన పేరాల స్రవంతి,సతీష్‌చంద్ర దంపతులు రూ.5,00,116, గ్రామానికి చెందిన వెన్ను సమ్మయ్య,అండమ్మ, సర్పంచ్ వెన్ను శృతిపూర్ణచందర్ దంపతులు రూ.1,50,116, కీర్తి స్వప్నసదానందం దంపతులు రూ.1,00,116లను ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యులకు మంగళవారం అందజేశారు. ఈనెల 8, 9, 10 తేదీల్లో జరిగే విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను విజయవంతం చేయాలని కమిటీ బాధ్యులు పిలుపునిచ్చారు.

'ఏం చేసిందని ఉత్సవాలు'

చెన్నారావుపేట : తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏం చేసిందని దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తోందని యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి హరీష్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని రైతులకు రుణమాఫీ కాలేదు, దళితులకు పంపిణీ చేస్తామన్న మూడెకరాల భూమి ఊసేలేదని ఎద్దేవా చేశారు. కుల సంఘాల భవనాల నిర్మాణాల జాడేలేదని ప్రశ్నించారు. సరైనా రోడ్లు లేవు ఉన్న రోడ్లకు మరమ్మతు దిక్కులేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధే కనిపిస్తోందని పేర్కొన్నారు. ఉత్సవాల పేరుతో ప్రజా సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు, ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

సీపీఐ ప్రజాగర్జనను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ప్రసాద్

వర్ధన్నపేట : ఈనెల 11న సీపీఐ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిర్వహిస్తున్న ప్రజాగర్జనను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఇల్లంద గ్రామంలో సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశానికి గొడిశాల భిక్షపతి అధ్యక్షతన ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. పాలకులు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. ఈనెల 11న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో లక్షలాది మందితో సీపీఐ ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు. ఇల్లంద గ్రామంలోని 126సర్వేనంబరు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు పట్టాలిచ్చి డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కడమంచి యాదగిరి, లొంక ఐలయ్య, బొడ్డుపెల్లి సాయిలు, ఎండీ అహ్మద్‌పాషా, పొన్నాల సారయ్య, మెరుగు ఆనందం, బొమ్మెర స్వామి, భూక్యా లక్ష్మి, భూక్యా అర్జున్, శివ, పాల రమ తదితరులు పాల్గొన్నారు.

అభినందన

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన 14మంది విద్యార్థులకు గురుకుల విద్యాలయాలలో సీట్లు వచ్చాయని పాఠశాల హెచ్‌ఎం పద్మశ్రీ మంగళవారం తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశం కోసం పరీక్షలు రాసిన శివతేజ, అక్షిత, నిఖిత, ఆకాంక్ష, నిషా, సిరి, శివమణి, జ్యోతి, కార్తిక్, .సౌజన్య, రుత్విక్, శ్రీజ, వరుణ్ సీట్లు సాధించారు. వీరికి సర్పంచ్ తిరుపతిరెడ్డి, హైస్కూల్ హెచ్‌ఎం నాగేశ్వరచారి, ఉపాధ్యాయులు సారయ్య, శ్రీనివాస్, రఘు, సుశీల, కౌర్, రమాదేవి, వీరస్వామి అభినందనలు తెలిపారు.

బ్యాంక్‌లో పొదుపు సొమ్ముకు భద్రత

దుగ్గొండి : బ్యాంక్‌లో పొదుపు చేసుకుంటే ఖాతాదారుల సొమ్ముకు భద్రతతో పాటు అధిక వడ్డీ లభిస్తుందని ఏపీజీవీబీ మేనేజర్ వేణుధనుంజయ అన్నారు. మండలంలోని రేకంపల్లి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి వ్యక్తి బ్యాంక్‌లో ఖాతా కలిగి ఉండటంతో పాటు బీమా సురక్షా, జీవన్‌జ్యోతి బీమా ప్రీమియం చెల్లించి కుటుంబానికి భద్రత కల్పించుకోవాలన్నారు. బ్యాంక్‌లో రుణాలు సకాలంలో చెల్లించి వడ్డీ మాఫీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో విజేందర్, పొన్నం వర్ష, ఫీల్డ్ అసిస్టెంట్ స్వర్ణ పాల్గొన్నారు.



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీజీవీ బ్యాంక్ మేనేజర్ వేణుధనుంజయ

వేలాడుతున్న విద్యుత్ తీగలు

- ఇబ్బంది పడుతున్న రైతులు
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

పర్వతగిరి : చేతికందే ఎత్తులో విద్యుత్ వైర్లు.. పొరపాటున గాలిదుమారం వస్తే అంతే సంగతులు.. విలువైన ప్రాణాలు పోవాల్సిందే.. మండలంలోని వివిధ గ్రామాల్లోని వ్యవసాయ భూములు, బావుల వద్ద విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ స్తంభాలు మధ్య దూరం ఎక్కువగా ఉండడం వల్ల వైర్లు కిందికు వేలాడుతున్నాయి. దీంతో అన్నదాతలు వ్యవసాయ భూముల వద్దకు వెళ్లేందుకు భయపడుతున్నారు. గతంలో విద్యుత్ వైర్లు కిందికి వేలాడడం వల్ల అనేక ప్రమాదాలు సంభవించి రైతులు, పశువులు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికై నా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వేలాడుతున్న వైర్లను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.



కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు

వైర్లు చేతికి అందుతున్నాయి



మండలంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో పంట పొలాలకు వెళ్లే దారిలో విద్యుత్ తీగలు చేతికి అందుతున్నాయి. అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసిన స్పందించడం లేదు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరి చేయాలి.

- రాజు, పర్వతగిరి

సైబర్ నేరాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై శ్రీనివాస్

వర్ధన్నపేట : సైబర్ నేరాలపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని వర్ధన్నపేట ఏఎస్సై శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వర్ధన్నపేటలో సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు చేసేవారు కొత్త వ్యక్తుల మాటలను నమ్మొద్దన్నారు. తెలియని మెసేజ్‌లపై క్లిక్ చేయవద్దని సూచించారు. సైబర్ నేరగాళ్ల మాయమాటలు చెప్పి బహుమతులు వచ్చాయని, లాటరీ తగిలిందని, రుణాలు ఇప్పిస్తామని ఇతరత్రా ఆశ చూపి ఆన్‌లైన్ ద్వారా డబ్బులకు ఎరవేస్తారన్నారు. అటువంటి వ్యక్తులు పంపే మెసేజ్‌లకు స్పందించ వద్దన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శంకర్, శ్రీనివాస్, కానిస్టేబుల్ బుచ్చిరాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మున్సిపల్ పరిధిలోని సర్వేనంబర్ 204లో గల 20గుంటల ప్రభుత్వ భూమిని కొంతమంది అధికార పార్టీ నాయకులు కబ్జా చేశారని తక్షణమే ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్ అన్నారు.ఈ మేరకు తహసీల్దార్ రాంమూర్తికి బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాయకులు కొంపల్లి రాజు, కల్వచర్ల రామాంజనేయ, మల్యాల సాంబమూర్తి, దుగ్యాల సమ్మయ్య, గూడూరు సందీప్, చింతం విజయ రాణి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ చైతన్యం కలిగి ఉండాలి

వర్ధన్నపేట : ప్రజలకు రాజకీయ చైతన్యం కలిగి ఉండాలని నియోజకవర్గ రాజకీయ చైతన్య వేదిక కన్వీనర్ డాక్టర్ సంకినేని వెంకట్ అన్నారు. మంగళవారం వర్ధన్నపేట పట్టణంలో రాజకీయ చైతన్య వేదిక కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో కన్వీనర్‌గా సంకినేని వెంకట్, కో కన్వీనర్లుగా జన్ను నర్సయ్య, దొనికెల మధుగౌడ్, ఎండీ దాదా సాహెబ్, బి.చక్రునాయక్, రాములు యాదవ్, వంగాల చంద్రారెడ్డి, సాంబయ్య మున్నూరుకాపు, ఎం. శ్రీనివాసచారి, బూర అశోక్ గౌడ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ రాజకీయ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను పర్యటిస్తూ సమావేశాలు ఏర్పాటు చేస్తామని, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ రాజకీయ చైతన్యం కలిగించడానికి కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

మేరు కులస్తులను ఆదుకోవాలి



నియామక పత్రం అందజేస్తున్న హరిప్రసాద్

దుగ్గొండి : మేరు కులస్తులు తమ వృత్తితోనే(టైలర్) జీవనం సాగిస్తున్నారని అయితే రెడీమెడ్ దుస్తులు రావడం వల్ల ఉపాధి కోల్పోయారని.. ప్రభుత్వం మేరు కులస్తులకు ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని మేరు సంఘం జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్ పెండ్యాల హరిప్రసాద్ అన్నారు. మండలంలోని మహ్మదాపురంలో మేరు సంఘం మండల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 50ఏళ్లు నిండిన మేరు కులస్తుల వారికి పెన్షన్ ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల సాయం చేయడంతో పాటు టైలర్ షాపునుకు ఉచిత విద్యుత్ వర్తింప జేయాలన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మేరు సంఘం మండల అధ్యక్షుడిగా నన్న రవి, ప్రధాన కార్యదర్శిగా నన్న రాజు, ఉపాధ్యక్షులుగా మాడిశెట్టి కుమారస్వామి, ఆడప సాంబయ్య, కీర్తిరాజు, శీలం రాజు, రామగిరి రాజేందర్, కోశాధికారిగా కీర్తి భిక్షపతి, కార్యదర్శులుగా బొలుకొండ సంతోష్, పాడిశెట్టి గణేష్, రామగిరి వీరస్వామి, కృష్ణంరాజు, గట్ల రాజు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా శ్రీనివాస్, రాజేందర్, విజయ్‌కుమార్, నరేష్, రాజు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో దోమకొండ శ్రీనివాస్, గూడూరు బాలాజీ, కొత్తకొండ విద్యాసాగర్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలపడాలి



కుట్టుశిక్షణ శిబిరం వీడ్కోలు సమావేశంలో కేక్‌కట్ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

రాయపర్తి : మహిళలు కుట్టుశిక్షణను వినియోగించుకొని ఆర్థికంగా బలపడాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని సన్నూరు గ్రామంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టుశిక్షణ శిబిరం ముగింపు, వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ.. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రత్యేక చొరవతో మహిళలను ఆర్థికంగా చైతన్యం చేసేందుకుగాను కుట్టుశిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నలమాస సారయ్య, మార్కెట్ డైరెక్టర్ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, సీసీ అనిత, వీఓఏలు పెదగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నాటిక పోటీలు నిర్వహించడం అభినందనీయం



కళాకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అరూరి

వరంగల్: పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతున్న తరుణంలో నాటికల పోటీలు నిర్వహించడం అభినందనీయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ ఆరెపల్లిలోని కళాభారతి సాంస్కృతిక సంస్థ స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్రస్థాయి నాటికల పోటీలను సోమవారం రాత్రి ఆయన ప్రారంభించారు. అనంతరం కళాకారులను ఎమ్మెల్యే శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ షీబారాణి, అనిల్‌కుమార్, రైతుబంధు జిల్లా అధ్యక్షురాలు లలితా యాదవ్, కళాభారతి సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు సాంబయ్య, సుందరమూర్తి, ప్యాక్స్ చైర్మన్ హరికృష్ణ, శ్రీనివాస్, నేరెళ్ల రాజు, వెంకన్న, భిక్షపతి, ఆదాం పాల్గొన్నారు.

ముమ్మరంగా సభ్యత్వ నమోదు చేపట్టాలి

ఖిలా వరంగల్: పద్మశాలీలు తమ ఐక్యతను చాటుతూ సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేపట్టాలని అఖిల భారత పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్ పిలుపునిచ్చారు. నగరంలోని 33వ డివిజన్ ఎస్‌ఆర్‌ఆర్‌తోట పద్మశాలి సంఘం భవనంలో సంఘం జి ల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ బాసాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా రవీందర్ హాజరై ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ వద్నాల నరేందర్, గోరంటల రాజు, బాసాని శ్రీనివాస్‌లతో కలిసి ఆయన సభ్యత్వాలను అందజేసి మాట్లాడారు. యు వతీ, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఆర్‌తోట పద్మశాలి సంఘం అధ్యక్షులు పోరండ్ల ఓంప్రకాశ్, ఉపాధ్యక్షులు గంజి సదానందం, బుదారపు సాంబయ్య, ప్రధాన కార్యదర్శి కొక్కుల సాంబయ్య, వెల్దండి రవిచందర్, కోదాటి రాంమోహన్, రమేష్, హరికృష్ణ, భిక్షపతి పాల్గొన్నారు.

డిమాండ్లను నెరవేర్చాలి

హన్మకొండ అర్బన్ : తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కారించాలని కోరుతూ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు ఈనెల 7న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట రిలే నిరా హార దీక్షలు చేపట్టనున్నట్లు హనుమకొండ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల రమేష్‌బాబు, మహేశ్వరం గౌరిశంకర్ తెలిపారు. మంగళవారం హనుమకొండ తహసీ ల్దార్ రాజ్‌కుమార్‌ను కలిసి సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రజలకు సేవ చేశామని, కానీ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో అలసత్వం వహిస్తుందన్నారు. నిరాహార దీక్షలకు పెద్ద ఎత్తున సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కోమాకుల కుమారస్వామి,మహేష్, కుమారస్వామి, సతీష్, వెంకటేశ్వర్లు, అశోక్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.